సాక్షి ఖమ్మం
గురువారం । 1 । జూన్ । 2023



.. కష్టాలు తీరేదెన్నడు?
జిల్లాలో అకాల వర్షాలతో పంట నష్టపోయిన మొక్కజొన్న రైతులు మిగిలిన పంట అమ్మకానికి అవస్థ పడుతున్నారు. 8లో



ముగిసిన ఎన్‌సీసీ శిబిరం
ఖమ్మం బల్లేపల్లిలో మూడు జిల్లాల ఎన్‌సీసీ కేడెట్లకు ఏర్పాటుచేసిన శిక్షణ శిబిరం బుధవారం ముగిసింది. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
43° / 27°
వాతావరణం
జిల్లాలో గురువారం ఉదయం నుంచే ఎండ ప్రభావం కనిపిస్తుంది. మధ్యాహ్నం పలు ప్రాంతాల్లో వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

రవాణాశాఖలో సేవలకు అంతరాయం

ఖమ్మంక్రైం: జిలాల్లోని రవాణా శాఖ కార్యాలయాల్లో బుధవారం నాన్ ట్రాన్స్‌పోర్ట్ విభాగంలో టూ, ఫోర్‌వీలర్ల రిజిస్ట్రేషన్ సేవలు నిలిచిపోయాయి. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పడిన అంతరాయం కారణంగా జిల్లాలోని ఖమ్మం, వైరా, సత్తుపల్లి కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు జరగలేదు. స్లాట్ బుక్ చేసుకున్న వారు మధ్యాహ్నం వరకు ఎదురుచూసినా ఫలితం లేకపోవడంతో వీరికి గురువారం రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు అధికారులు ప్రకటించారు. కాగా, ఇతర రిజిస్ట్రేషన్లు, లైసెన్సుల జారీ మాత్రం యధాతథంగా కొనసాగింది.

పాఠశాలల్లో డాక్యుమెంటరీ చిత్రీకరణ

ఖమ్మంసహకారనగర్: జిల్లా కేంద్రంలోని ఎన్నెస్పీ కాలనీలో ఉన్న జీపీఎస్, మామిళ్లగూడెం జీపీఎస్‌ను మన ఊరు – మన బస్తీ పథకం ద్వారా అభివృద్ధి చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలను జిల్లా విద్యాశాఖాధికారి ఇ.సోమశేఖరశర్మ, ఏఎంఓ రవికుమార్, అర్బన్ ఎంఈఓ ఎం.శ్రీనివాస్ బుధవారం తనిఖీ చేశారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పాఠశాలల అభివృద్ధిని వివరిస్తూ డాక్యుమెంటరీ చిత్రీకరిస్తుండగా వారు పరిశీలించారు.

సీఎం కప్ ఫుట్‌బాల్‌లో విజేతగా జిల్లా జట్టు



క్రీడాకారులకు పతకాలు అందజేస్తున్న మంత్రి సబితాఇంద్రారెడ్డి

ఖమ్మం స్పోర్ట్స్: హైదరాబాద్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీల్లో జిల్లా క్రీడాకారుల హవా కొనసాగుతోంది. బుధవారం జరిగిన మహిళల ఫుట్‌బాల్ ఫైనల్స్‌లో ఖమ్మం – నల్లగొండ జట్లు తలపడగా 3–0 గోల్స్ తేడాతో నల్లగొండపై ఖమ్మం జట్టు గెలుపొంది టైటిల్‌ను చేజిక్కించుకుంది. క్రీడాకారులకు రాష్ట్ర మంత్రి సబితాఇంద్రారెడ్డి పతకాలు అందజేశారు. అలాగే, కబడ్డీలో మహిళల జట్టు తృతీయస్థానంలో నిలిచింది. ఈమేరకు క్రీడాకారులను మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, కలెక్టర్ వీ.పీ.గౌతమ్, డీవైఎస్‌ఓ ఎం.పరంధామరెడ్డి, ఫుట్‌బాల్ అసోసియేషన్ బాధ్యులు సెల్యూకాస్, కె.ఆదర్శ్‌కుమార్, క్రిస్టోఫర్‌బాబు అభినందించారు.

ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ స్నేహలత

వైరా: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ స్నేహలత సూచించారు. వైరా మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు రైతు వేదికలో బుధవారం ఆమె వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 2నుంచి మొదలయ్యే దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చేపట్టాల్సిన కార్యక్రమాలను వివరించారు. ప్రతీ ప్రభుత్వ కార్యాలయంలో పండుగ వాతావరణాన్ని తలపించేలా ఉత్సవాలు నిర్వహించాలని తెలిపారు. ఏసీపీ ఎం.ఏ.రెహమాన్, తహసీల్దార్ నారపోగు అరుణ, మున్సిపల్ కమిషనర్ పి.వెంకటేశ్వర్లు, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఆలయ నిర్వహణకు ఎంపీ రూ.3లక్షల విరాళం



శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

బోనకల్: మండలంలోని చొప్పకట్లపాలెంలో నూతనంగా నిర్మించిన శివాలయంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర బుధవారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ఎంపీ ఆలయ నిర్వహణకు గాను రూ.3లక్షల విరాళాన్ని అందజేసి మాట్లాడారు. ఆలయ నిర్మాణ సమయంలో 1,200 సిమెంట్ బస్తాలు అందజేసిన తాను మండపంలో వేసేందుకు రూ.3 లక్షల విలువైన గ్రానైట్ ఇస్తానని తెలిపారు. సర్పంచ్ యర్రంశెట్టి సుబ్బారావుతో పాటు బోయినపల్లి వెంకటేశ్వర్లు, బోయిన శేఖర్‌బాబు, శ్రీకాంత్, సోమయ్య, తాళ్లూరు రామారావు, రామచంద్రయ్య పాల్గొన్నారు.

ఇక ఎల్‌ఆర్‌ఎస్!

- క్షేత్రస్థాయిలో కొనసాగుతున్న పరిశీలన
- జిల్లావ్యాప్తంగా 50,906 దరఖాస్తులు
- స్థలాల రెగ్యులరైజేషన్ నిర్ణయంతో ఊరట
- ప్రభుత్వానికి సమకూరనున్న ఆదాయం



సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లావ్యాప్తంగా ఎల్‌ఆర్‌ఎస్(లే ఔట్ రెగ్యులరైజేషన్ స్కీమ్) దరఖాస్తులకు మోక్షం లభించనుంది. రెగ్యులరైజేషన్ కోసం ఖమ్మం కార్పొరేషన్‌తోపాటు సత్తుపల్లి, మధిర, వైరా మున్సిపాలిటీలు, మేజర్ గ్రామపంచాయతీల్లో ఉన్న వెంచర్ల క్రమబద్ధీకరణకు మొత్తం 50,906 దరఖాస్తులు అందాయి. అక్రమ లే ఔట్ల క్రమబద్ధీకరణ కోసం 2020లో ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ పథకాన్ని ప్రవేశపెట్టింది. అప్పట్లో వచ్చిన దరఖాస్తుల పరిశీలన ప్రస్తుతం కొనసాగుతోంది. మున్సిపాలిటీల వారీగా ఏర్పాటుచేసిన బృందాలు దరఖాస్తులతోపాటు క్షేత్రస్థాయిలో వెంచర్లను క్షుణ్ణంగా పరిశీలిస్తుండగా.. అర్హులను గుర్తించే ప్రక్రియను కలెక్టర్ వీ.పీ.గౌతమ్ పర్యవేక్షిస్తున్నారు.



ప్రారంభమైన పరిశీలన

ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా అందిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ ప్రస్తుతం ప్రారంభమైంది. టౌన్ ప్లానింగ్ అధికారులు దరఖాస్తుల ఆధారంగా క్షేత్రస్థాయిలో వెంచర్లను పరిశీలిస్తూ, హైటెన్షన్ టవర్లు ఉన్నాయా, చెరువు, బఫర్‌జోన్ పరిధిలోకి వస్తుందా, ప్రపోజల్ రోడ్లు ఏమైనా ఉన్నాయా, జాతీయ రహదారులు వెళ్లనున్నాయా, ప్రభుత్వ భూమి ఉందా అనేది నిర్ధారిస్తున్నారు. పరిశీలన పూర్తయ్యాక అన్ని అర్హతలు ఉన్న దరఖాస్తులను ఆన్‌లైన్ చేసి రెగ్యులరైజేషన్‌కు అనుమతించినట్లుగా దరఖాస్తుదారులకు సమాచారం ఇస్తారు. అయితే రెగ్యులరైజేషన్ కోసం స్థలం మార్కెట్ విలువపై 14శాతం ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. గతంలో దరఖాస్తుతో పాటు చెల్లించిన రూ.వెయ్యి పోగా మిగిలిన సొమ్ము చెల్లించి రెగ్యులరైజ్ చేసుకోవాల్సి ఉంటుంది.

కొనుగోలుదారులకు ఊరట

అనుమతి లేని వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి ఎల్‌ఆర్‌ఎస్ పథకం ఊరట కలిగిస్తోంది. స్థలాలు కొనుగోలు చేసినా ఇంటి నిర్మాణానికి అనుమతులు రాక, స్థలంపై రుణాలు తీసుకునేందుకు ఇబ్బంది ఎదురైంది. ఇప్పుడు ఈ స్కీమ్ ద్వారా అటు కొనుగోలుదారులకు లాభమే కాక ప్రభుత్వానికి పెనాల్టీ రూపంలో ఆదాయం లభించనుంది. ఇక వెంచర్ల రెగ్యులరైజేషన్ కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలన జిల్లాల్లో చురుగ్గా సాగుతుండగా ఈ ప్రక్రియలో జిల్లా రాష్ట్రంలోనే ముందంజలో నిలిచింది.

వెంచర్ల రెగ్యులరైజ్ కోసం..

లే ఔట్ ఆమోదం పొందని వెంచర్లలో కొనుగోలు చేసిన స్థలాలను రెగ్యులరైజ్ చేయడం కోసం ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ స్కీమ్‌ను ప్రవేశపెట్టింది. గతంలో అక్రమ లే ఔట్లలోని ప్లాట్ల నిర్మాణాల రిజిస్ట్రేషన్‌ను సర్కారు నిలిపివేసింది. కానీ రెగ్యులరైజేషన్ స్కీమ్‌కు అవకాశం కల్పించడంతో ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి ఊరట లభించింది. 2020కి పూర్వం పలుమార్లు దరఖాస్తులు ఆహ్వానించినా ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు లేకపోవడంతో ముందుకు సాగలేదు. 2020లో 131 జీఓను మున్సిపల్ శాఖ విడుదల చేసింది. 2020 ఆగస్టు 26కు ముందు స్థలాలను రిజిస్ట్రేషన్ చేసుకుని ఉండాలని ప్రభుత్వం మార్గదర్శకాలు ప్రకటించగా జిల్లాలో మొత్తం 50,906 దరఖాస్తులు వచ్చాయి. ప్రతీ దరఖాస్తుదారుడు రూ.వెయ్యి చొప్పున చెల్లించాడు. కానీ ఆతర్వాత ప్రక్రియ పలు కారణాలతో నిలిచిపోయింది.

ఎల్‌ఆర్‌ఎస్ కోసం మున్సిపాలిటీల వారీగా వచ్చిన దరఖాస్తులు

మున్సిపాలిటీ / కార్పొరేషన్	దరఖాస్తులు	పరిశీలించిన ప్లాట్లు	అనుమతులకు ఆన్‌లైన్ చేసినవి
ఖమ్మం	39,557	2,990	2,620
మధిర	4,213	1,298	1,126
సత్తుపల్లి	3,666	1,215	1,155
వైరా	3,470	855	820
మొత్తం	50,906	6,358	5,721

ఇన్నాళ్లు అభివృద్ధిపైనే దృష్టి



బీఆర్‌ఎస్ కార్యకర్తల కుటుంబాలకు బీమా చెక్కులు అందిస్తున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

- రానున్న ఐదు నెలలు రాజకీయాలే..
- డబ్బు, అహంతో ప్రజల ఆత్మాభిమానాన్ని కొనలేరు..
- బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి పువ్వాడ

రఘునాథపాలెం: ఇప్పటి వరకు అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపైనే దృష్టి సారించాం.. ఎన్నికలకు ఐదు నెలలు గడువు ఉంది. ఈ సమయమంతా రాజకీయాలు చేద్దాం.. అని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రఘునాథపాలెం మండలం చిమ్మపుడిలో బుధవారం ఏర్పాటుచేసిన బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి మాట్లాడారు. జిల్లాలో బీఆర్‌ఎస్ పార్టీ తిరుగులేని శక్తిగా ఎదగగా, చరిత్రలో ఎన్నడూలేని విధంగా గడిచిన తొమ్మిదేళ్లలో కేసీఆర్ హయాంలో అభివృద్ధి సాధ్యమైందన్నారు. జిల్లాలో బీఆర్‌ఎస్ పార్టీ చేపడుతున్న ఆత్మీయ సమ్మేళనాలను కొన్ని శక్తులు జీర్ణించుకోలేకపోతున్నాయని మండిపడ్డారు. పార్టీని, ప్రభుత్వాన్ని అడ్డం పెట్టుకొని ఆర్థికంగా బలపడిన కొందరు(పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ఉద్దేశించి) ముఖ్యమంత్రి కేసీఆర్‌ను గద్దె దించుతాం, ప్రభుత్వాన్ని పడగొడతామంటూ ప్రగల్భాలు పలుకుతున్నారని ఎద్దేవా చేశారు. అయితే, డబ్బు, అహంతో ప్రజల ఆత్మాభిమానాన్ని సాధించలేమనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ప్రజాప్రతినిధిగా చేసిన మంచి పనులతోనే ప్రజల ప్రేమాభిమానాలు పొందొచ్చని తెలిపారు.



దేవుడు అన్నీ ఇచ్చాడు...

కాంట్రాక్టు పనుల్లో అడ్డదారులు తొక్కి కోట్లకు పడగలెత్తిన వ్యక్తి ఆయన అనుయాయులతో తనపై తప్పుడు ప్రచారం చేయిస్తూ అవినీతి ముద్ర వేయించాలనే యత్నం చేస్తున్నాడని మంత్రి పువ్వాడ పేర్కొన్నారు. అయితే, తనకు దేవుడు అన్ని రకాలుగా బాగానే ఇచ్చాడని.. తనకు ఇవ్వడమే తప్ప తీసుకునే అలవాటు లేదని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలకు ఐదు నెలల సమయమే ఉన్నందున పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. చిన్నచిన్న బేదాభిప్రాయాలు ఉన్నా విడనాడి ప్రతీ కార్యకర్త కాలర్ ఎగరేసుకునేలా బీఆర్‌ఎస్ పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకురావడమే ధ్యేయంగా కృషి చేయాలన్నారు. పార్టీని నమ్ముకున్న అందరికీ మంచి అవకాశాలు లభిస్తాయని మంత్రి హామీ ఇచ్చారు. ఇంటింటికీ తాగునీరు ఇవ్వడమే కాక ప్రాజెక్టుల నిర్మాణంతో తెలంగాణను సస్యశ్యామలం చేసిన కేసీఆర్ మూడోమారు ముఖ్యమంత్రిగా గెలవడం ఖాయమని పువ్వాడ తెలిపారు. తొలుత మంత్రికి బీఆర్‌ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికి ఎడ్లబండిపై ఊరేగింపు నిర్వహించారు. అలాగే, ప్రమాదవశాత్తు మృతి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తల కుటుంబాలకు బీమా చెక్కులను మంత్రి అందజేశారు. ఈ సభకు వైస్ ఎంపీపీ గుత్తా రవి అధ్యక్షత వహించగా ఎంపీపీ భుక్యా గౌరి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అజ్మీర వీరూనాయక్‌తో పాటు ప్రజాపతినిధులు, నాయకులు మద్దినేని వెంకటరమణ, కుర్రా భాస్కర్‌రావు, పిన్ని కోటేశ్వరరావు, కొంటెముక్కల వెంకటేశ్వర్లు, మాదంశెట్టి హరిప్రసాద్, గౌరైకృష్ణవేణి, కాంపాటి రవి, గంగిరెడ్డి విజయ్‌రెడ్డి, దొంతు సత్యనారాయణ, గౌరై శ్రీనివాసరావు, నున్నా శ్రీనివాసరావు, చెరుకూరి పూర్ణ, చెరుకూరి బిక్షమయ్య, గుండ్ల ముత్తయ్య, భూక్యా లక్ష్మణ్‌నాయక్, ఉయ్యూరు వెంకటనారాయణ, చెన్నబోయిన సైదులు, కొర్లపాటి రామారావు, రామా వెంకటేశ్వర్లు, తోట వెంకట్, దేవేందర్, పగ్గళ ఉపేందర్ పాల్గొన్నారు.

16న ఖమ్మంకు మంత్రి కేటీఆర్

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా ఖమ్మంకు ఈనెల 16న మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌ను ఆహ్వానించాలని నిర్ణయించినట్లు మంత్రి పువ్వాడ అజయ్ తెలిపారు. కేఎంసీ కార్యాలయంలో ఉత్సవాలపై జరిగిన సమీక్షలో పువ్వాడ మాట్లాడుతూ గోళ్లపాడు చానల్‌పై నిర్మించిన పార్కులు, ఇతర అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు కేటీఆర్‌ను ఆహ్వానించనున్నట్లు చెప్పారు. ఆ రోజు కేటీఆర్‌కు వీలుపడని పక్షంలో మరో రోజు ఆహ్వానించి పార్కులు, అభివృద్ధి పనులను ప్రారంభించుకుందామని తెలిపారు.

గర్భిణులకు న్యూట్రీషన్ కిట్లు..

- ఆశలకు యూనిఫాం, ఏఎన్‌ఎంలకు బీపీ ఆపరేటర్లు
- ఈనెల 14న పంపిణీకి ఏర్పాట్లు



మాలతి, డీఎంహెచ్‌ఓ

ఖమ్మం వైద్యవిభాగం: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 14న జిల్లాలో వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యాన ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.మాలతి వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో బుధవారం ఆమె మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. జిల్లాలో 1,348 మంది ఆశా వర్కర్లకు ఒక జత యూనిఫాం ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే ఏఎన్‌ఎంలకు అత్యాధునిక బీపీ ఆపరేటర్ మిషన్లు పంపిణీ చేయనుండగా, ఇప్పటికే 432 మిషన్లు వచ్చాయని చెప్పారు. అంతేకాక ఎన్‌సీడీ కార్యక్రమంలో భాగంగా 30 ఏళ్లు నిండిన వారికి బీపీ పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు ఇస్తామని తెలిపారు. ఇక గర్భిణులకు న్యూట్రీషన్ కిట్ల పంపిణీని కూడా అదేరోజు ప్రారంభిస్తామని వివరించారు. మూడు, ఎనిమిది నెలల గర్భిణులకు కిట్లు ఇచ్చేలా ఇప్పటికే లబ్ధిదారులను గుర్తించామని డీఎంహెచ్‌ఓ తెలిపారు. అలాగే, దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రులను మామిడి తోరణాలతో అలంకరిస్తామని, చికిత్స పొందుతున్న వారికి పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేయడంతో పాటు కోవిడ్ వారియర్లను సన్మానిస్తామన్నారు. ఇక ఎన్‌క్వాస్ అవార్డులు గెలుచుకున్న కూసుమంచి, చింతకాని, వల్లభి, సుబ్లేడు, పెద్దగోపతి, బోనకల్, ఏన్కూర్, మామిళ్లగూడెం, ముస్తఫానగర్, శ్రీనివాసనగర్ ఆస్పత్రుల వైద్యులు, సిబ్బందిని సన్మానించడమే కాక నియోజకవర్గాల వారీగా ఉత్తమ ఆశ, ఏఎన్‌ఎం, ఎల్‌టీ, వైద్యులకు అవార్డులు ఇవ్వనున్నట్లు డీఎంహెచ్‌ఓ తెలిపారు.

వైభవంగా రామయ్య నిత్యకల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుకను బుధవారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ఏజెన్సీ డీఈఓ ఏమాయె?

- జిల్లాల పునర్విభజనతో ఆ పోస్టు మాయం
- ఇన్‌చార్జ్‌లతోనే నడుస్తున్న గిరిజన, ఆశ్రమ పాఠశాలలు

భద్రాచలం: ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో ఫలితాలు తగ్గుతున్న వేళ ఏజెన్సీ డీఈఓ పోస్టు మళ్లీ చర్చకు వచ్చింది. నాలుగు జిల్లాల్లో విస్తరించి ఉన్న భద్రాచలం ఐటీడీఏలో గిరిజన విద్య పటిష్టత కోసం గతంలో ఉన్న కీలక పోస్టును మళ్లీ భర్తీ చేయాలని, లేదా గిరిజన సంక్షేమ శాఖ ఆధీనంలో నూతన పోస్టు ఏర్పాటు చేయాలనే డిమాండ్ మొదలైంది.

2016లో డీఈఓగా అప్‌గ్రేడ్..

గతంలో ఐటీడీఏ పరిధిలో ఏజెన్సీ ఇన్‌చార్జ్ డీఈఓగా రవీందర్‌బాబు ఉండేవారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లు, బెస్ట్ అవైలబుల్ పాఠశాలలు, గురుకులాలను పర్యవేక్షించగా, 2016లో జిల్లాల పునర్విభజన సమయాన పోస్టును జిల్లా విద్యాశాఖ అధికారిగా అప్‌గ్రేడ్ చేశారు. అప్పటి నుంచి డీఈఓ పరిధిలోనే విద్యాసంస్థలు పనిచేస్తున్నాయి.

ఇన్‌చార్జ్‌లే దిక్కు..

2016లో ఏజెన్సీ డీఈఓ పోస్టును రద్దు చేసిన నాటి నుంచి ఇన్‌చార్జ్‌ల పాలనలోనే గురుకులాలు, ఆశ్రమాలు నడుస్తున్నాయి. గిరిజన గురుకులాల ఇన్‌చార్జ్‌గా ఉన్న ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్‌కు ఆర్‌సీఓగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆశ్రమ పాఠశాల పర్యవేక్షణను ఐటీడీఏ డీడీ రమాదేవికి అప్పగించినా, ఆమె బదిలీపై వెళ్లడంతో ఆ బాధ్యతలూ డేవిడ్‌రాజ్‌కే ఇచ్చారు.

పూర్తిస్థాయి అధికారి అవసరం..

ఐటీడీఏ పరిధిలో 50 ఆశ్రమ పాఠశాలలు, మూడు బెస్ట్ అవైలబుల్ పాఠశాలలు ఉండగా, గిరిజన గురుకులాలు భద్రాద్రి జిల్లాలో 21, ఖమ్మం జిల్లాలో ఆరు ఉన్నాయి. పూర్తిస్థాయిలో ఏజెన్సీ డీఈఓ లేకపోవడం, ఇన్‌చార్జ్‌ల పర్యవేక్షణలోపంతో ఫలితాలపై ప్రభావం చూపిస్తోందని చెబుతున్నారు. ఇకనైనా గిరిజన విద్యావ్యవస్థలో కీలకమైన ఏజెన్సీ డీఈఓ పోస్టును తక్షణమే భర్తీ చేయాలని విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి.

డీడీఎన్ @ రూ.10 వేలు

- ధూపదీప నైవేద్య పథకం వేతనం పెంపు
- ఉమ్మడి జిల్లాలో 98 ఆలయాలు కొత్తగా స్కీంలోకి..
- అర్చకుల్లో హర్షాతిరేకాలు



ఖమ్మంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న అర్చకులు

కొత్తగూడెంటౌన్ : ఆదాయం తక్కువగా ఉన్న ఆలయాల నిర్వహణకు ధూపదీప నైవేద్యం పథకం కింద ఇస్తున్న వేతనం, పడితరం ఖర్చులను రూ.10 వేలకు పెంచుతున్నట్లు సీఎం కేసీఆర్ బుధవారం ప్రకటించగా.. ఉమ్మడి జిల్లాలోని 319 ఆలయాలకు లబ్ధి చేకూరనుంది. ఇప్పటివరకు ఖమ్మం జిల్లాలో 238 ఆలయాలకు, భద్రాద్రి జిల్లాలో 81 ఆలయాలకు నెలకు అర్చకుడి వేతనం రూ.4వేలు, ఇతర ఖర్చులకు రూ.2వేలు మొత్తం రూ.6వేల చొప్పున ఆలయ ఖాతాల్లో జమయ్యేవి. అయితే ఈ మొత్తాన్ని రూ.10 వేలకు పెంచుతున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించారు. అంతేకాక ఖమ్మం జిల్లాలో కొత్తగా 63 ఆలయాలు, భద్రాద్రి జిల్లాలో 35 ఆలయాలను ఈ పథకం కింద చేర్చనున్నట్లు తెలిసింది. వీటికి కూడా పథకం వర్తిస్తే ఉమ్మడి జిల్లాలో ఆలయాల సంఖ్య 417కు పెరగనుందని ఉమ్మడి జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సులోచన తెలిపారు.

2007లో ప్రారంభం

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆదాయం తక్కువగా ఉన్న ఆలయాలు జీర్ణావస్థకు చేరగా, 2007లో దివంగత వైఎస్.రాజశేఖరరెడ్డి ఈ ఆలయాలపై దృష్టి సారించారు. ఆలయాలు మూతబడవద్దనే ఉద్దేశంతో అర్చకుల వేతనం రూ.2,000, ఇతర ఖర్చులు రూ.500 కలిపి రూ.2,500 ఆలయ ఖాతాల్లో జమయ్యేలా చూశారు. 2014లో తెలంగాణ ఆవిర్భావం తర్వాత ఈ మొత్తాన్ని రూ.6 వేలకు పెంచారు. అయితే ప్రస్తుతం పెరిగిన ధరలతో రూ.6వేలు సరిపోవడం లేదంటూ అర్చకులు కొంతకాలంగా ప్రభుత్వానికి వినతిపత్రాలు సమర్పిస్తూనే ఉన్నారు. ఎట్టకేలకు వారి వేతనాన్ని రూ.10 వేలకు పెంచుతూ సీఎం నిర్ణయించడంతో వారిలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఇక వేద పండితులు, శాస్త్ర పండితులకు చెల్లించే గౌరవ వేతనాన్ని కూడా రూ.2,500 నుంచి రూ.5,000కు పెంచారని, ఈ భృతి పొందే వయసును 75 ఏళ్ల నుంచి 65 ఏళ్లకు తగ్గించారని ఏసీ వివరించారు.

అర్చకుల సంబురాలు

ఖమ్మంగాంధీచౌక్: ధూప దీప నివేదన పథకం అర్చకులకు వేతనాలు పెంచుతున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించటంతో బుధవారం ఖమ్మంలో అర్చకులు సంబురాలు జరుపుకున్నారు. కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో అర్చక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నావజ్జల ప్రసాద్ శర్మ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మునగలేటి రమేష్ శర్మ, మరింగంటి భార్గవాచార్యులతోపాటు అవధానుల సీతారామ శర్మ, బిజామళ్ల రాధాకృష్ణ, ఉమేష్, దిలీప్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.



లెక్క తప్పేదే లే...

- ఆన్‌లైన్‌లో నమోదు చేశాకే స్టాంపు పేపర్ల అమ్మకం
- వెండర్లతో అమలుచేయిస్తున్న అధికారులు
- 2వ తేదీ నుంచి మాన్యువల్ విక్రయాలకు అడ్డుకట్ట

ఖమ్మంమయూరిసెంటర్: స్టాంపుల విక్రయాల్లో లెక్క తప్పకుండా ఆన్‌లైన్ ప్రక్రియ మొదలుపెట్టారు. ప్రతీ స్టాంప్ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించాకే విక్రయించాలన్న నిర్ణయంతో ఎలాంటి అవకతవకలు జరగవని.. ఇటు ప్రభుత్వం, అటు ప్రజలకు నష్టం ఉండదని చెబుతున్నారు. ఈమేరకు సబ్ రిజిస్ట్రార్ల వారీగా స్టాంప్ వెండర్లకు యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌లను రిజిస్ట్రేషన్ల శాఖ ఇప్పటికే కేటాయించింది. ఇక స్టాంప్ వెండర్లతో వారి వివరాలు, స్టాంప్ పేపర్ల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయిస్తున్నారు.


2నుంచి ఆన్‌లైన్‌లోనే..

ప్రస్తుతం స్టాంప్ వెండర్ల వివరాలను ఆన్‌లైన్ చేసే ప్రక్రియ కొనసాగుతోంది. సబ్ రిజిస్ట్రార్లు స్టాంప్ వెండర్లతో స్టాక్ ఎంట్రీ చేయించాల్సి ఉంటుంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో 190 మంది స్టాంప్ వెండర్లు ఉండగా.. వీరిలో దాదాపు 150 మంది వరకు ఆన్‌లైన్ చేయించుకున్నారు. ఇంకా మిగిలిన వారిలో పలువురికి ఆన్‌లైన్‌పై అవగాహన లేకపోగా అధికారులు ఆ దిశగా దృష్టి సారించారు. ఎట్టి పరిస్థితుల్లో 2వ తేదీ నుంచి స్టాంప్‌లను ఆన్‌లైన్‌లోనే విక్రయించాలని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఆదేశాలు జారీ చేసింది. మాన్యువల్‌గా అమ్మితే చెల్లవని అధికారులు వెల్లడించారు.

అక్రమాలకు తావు లేకుండా..

ఆన్‌లైన్ విక్రయాలతో ఎవరి దగ్గర ఎన్ని స్టాంప్‌లు ఉన్నాయి? వీటిలో ఎన్ని విక్రయించారనే వివరాలను ఆన్‌లైన్ ద్వారా ఎప్పటికప్పుడు అధికారులు పరిశీలించవచ్చు. అలాగే, కొనుగోలు చేసిన వివరాలు కూడా తెలిసిపోతాయని, వెండర్ల వద్ద స్టాక్ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కానుండడంతో కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్‌లో విక్రయించేందుకు వీలు పడదు. అలాగే, ఎవరైనా అక్రమాలకు పాల్పడినప్పుడు ఎవరు అమ్మారు, ఎవరు కొనుగోలు చేశారనేది కూడా తెలిసిపోతుంది. అంతేకాక పాత డేట్లతో స్టాంప్ పేపర్లు అమ్మకం ఇక నుంచి వీలుకాదని, తద్వారా అక్రమాలకు చెక్ పడుతుందని చెబుతున్నారు.

అన్ని వివరాలు తెలుసుకోవచ్చు...



స్టాంప్ పేపర్ల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి విక్రయించాలనే నిర్ణయం మంచిది. తద్వారా ఎవరు, ఎన్ని పేపర్లు విక్రయించారు, స్టాక్ ఎంత ఉందనేది తెలిసిపోతుంది. ఈనెల 2వ తేదీన ప్రతీ స్టాంప్ వెండర్ ఆన్‌లైన్‌లో నమోదు చేశాకే అమ్మాల్సి ఉంటుంది. అలాకాకుండా రిజిస్టర్లలో నమోదు చేసి అమ్మితే వాటిని పరిగణనలోకి తీసుకోం.

– చిట్టిమళ్ల అశోక్‌కుమార్, జిల్లా రిజిస్ట్రార్, స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ

క్లుప్తంగా

ముగిసిన ఎన్‌సీసీ శిబిరం


ఫైరింగ్‌లో శిక్షణ పొందుతున్న కేడెట్లు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం బల్లేపల్లిలోని బ్లూమింగ్ మైండ్ స్కూల్‌లో కొనసాగుతున్న ఎన్‌సీసీ కేడెట్ల శిక్షణ శిబిరం బుధవారం ముగిసింది. ఈసందర్భంగా ఖమ్మం, వరంగల్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన 431 మంది కేడెట్లకు క్రమశిక్షణ, నాయకత్వం, డ్రిల్, ఫైరింగ్‌లో శిక్షణ ఇచ్చినట్లు నిర్వాహకులు వెల్లడించారు. కాగా, క్యాంప్‌ను కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ నవీన్ పర్యవేక్షించారు.

నేడు జిల్లాకు జమ్మూకశ్మీర్ మాజీ డిప్యూటీ సీఎం


పైనంపల్లి వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం/నేలకొండపల్లి: జమ్మూకశ్మీర్ మాజీ డిప్యూటీ సీఎం డాక్టర్ నిర్మల్ సింగ్ గురువారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 11గంటలకు జిల్లాకు చేరుకోనున్న ఆయన కోదాడ – కురవి జాతీయ రహదారి పనులను పరిశీలిస్తారు. ఆతర్వాత నేలకొండపల్లి మండలం పైనంపల్లిలో పనులను పరిశీలించి మధ్యాహ్నం ఒంటి గంటకు ఖమ్మంలో విలేకరులతో మాట్లాడారు. ఆతర్వాత బీజేపీ పార్టీ సోషల్ మీడియా బాధ్యులతో సమావేశమై బోనకల్ మీదుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్యటనకు వెళ్తారు. ఈమేరకు నిర్మల్‌సింగ్ పర్యటన ఏర్పాట్లను బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నున్నా రవికుమార్ బుధవారం నేలకొండపల్లిలో పరిశీలించారు. నాయకులు మన్నె కృష్ణారావు, వీరభద్రం, దుర్గారావు, కోటి హనుమంతరావు, సూరేపల్లి జ్ఞానరత్నం, మహేష్, వెంకట్, కృష్ణ పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికులకు పెండింగ్‌లో పీఆర్సీలు


సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్

సత్తుపల్లి: టీఎస్ఆర్టీసీ కార్మికులకు రెండు పీఆర్సీలు చెల్లించకుండా పెండింగ్‌లో ఉంచి ఇబ్బందులకు గురి చేస్తున్నారని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్(ఎస్‌డబ్ల్యూఎఫ్) రీజియన్ కార్యదర్శి పిట్టల సుధాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. సత్తుపల్లిలో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2019, 2021 సంవత్సరాల వేతన ఒప్పందాలను పక్కనబెట్టడంతో పాటు 2013లో 30 శాతం పీఆర్సీ ప్రకటించిన యాజమాన్యం పదేళ్లు గడిచినా బకాయిలు చెల్లించలేదన్నారు. టీఎస్ఆర్టీసీలో ఎన్నికలు జరపకుండా, సంఘాలను రానివ్వకుండా కార్మికులపై పని భారం మోపుతున్నారని ఆరోపించారు. గతంలో ఎనిమిది సంఘాలతో జేఏసీ ఉండగా.. ప్రస్తుతం జేఏసీని కాదని ఐఎన్‌టీయూసీ నేతలు ఒంటెద్దు పోకడలు అవలంభిస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో సత్తుపల్లి డిపో కార్యదర్శి సీహెచ్‌వీకే.రెడ్డి, నాయకులు వెంకటయ్య, దొరబాబు, మహేశ్వరరావు, మోరంపూడి పాండురంగారావు, కొలికపోగు సర్వేశ్వరరావు, రావుల రాజబాబు పాల్గొన్నారు.

రామాలయంలో లడ్డూ టెండర్ ఖరారు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో భక్తుల కోసం తయారు చేసే లడ్డూ ప్రసాద టెండర్‌ను ఖరారు చేసినట్లు ఈఓ రమాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భద్రాచలానికి చెందిన లక్ష్మీగణపతి ఏజెన్సీస్ నిర్వాహకులు దేవాదాయ శాఖ నిర్దేశించిన రేట్లు, నియమ నిబంధనల మేరకు ఈ–టెండర్‌ను దక్కించుకున్నారని పేర్కొన్నారు. అనుమతి నిమిత్తం దేవాదాయ శాఖ కమిషనర్‌కు పంపినట్లు ఈఓ తెలిపారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

పాల్వంచరూరల్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఐటీడీఏ ఏపీఓ(జనరల్), ఇన్‌చార్జ్ డీడీ డేవిడ్‌రాజు సూచించారు. మండలంలోని కిన్నెరసాని గిరిజన క్రీడాపాఠశాల్లో ఏర్పాటు చేసిన వేసవి క్రీడా శిబిరం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా హాజరైన డీడీ మాట్లాడుతూ వేసవి శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు నిరంతరం సాధన చేయడం ద్వారా రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఉద్బోధించారు. విద్యార్థులకు క్రీడాదుస్తులు, షూస్ అందించడమే కాక భోజన వసతి కల్పించి ఆర్చరీ, అథ్లెటిక్స్, వాలీబాల్, ఖో–ఖో, కబడ్డీ, బాక్సింగ్, రెజ్లింగ్, హాకీలో కూడా శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం చందు, ఏటీడీఓ నర్సింహారావు, స్పోర్ట్స్ ఆఫీసర్ డాక్టర్ వీరూనాయక్‌తో పాటు బుగ్గ వెంకటేశ్వర్లు, మోతీలాల్, హరికృష్ణ, వెంకన్న, అన్నం వెంకటేశ్వర్లు, భద్రు, నాగరాజు, శ్రీనివాసరావు, నాగప్రత్యూష, దివ్య, కృష్ణకుమారి, బాపమ్మ, రవీందర్, నిఖిల్, వెంకట్ పాల్గొన్నారు.

మొక్కజొన్న రైతుల కష్టాలు తీరేదెన్నడు?

కొనుగోలు కేంద్రాల్లోనే మగ్గుతున్న బస్తాలు

- లారీల కొరత.. అధికారుల పట్టింపులేని తనం
- రాత్రింబవళ్లు కాపలా ఉంటున్న రైతులు


కొనుగోలు కేంద్రం వద్ద కాంటా పూర్తయిన మొక్కజొన్న బస్తాలు

చింతకాని: మొక్కజొన్న రైతుల కష్టాలు ఇప్పట్లో తీరేలా లేవు. అకాల వర్షాలు రైతులను తీవ్రంగా నష్టపర్చగా.. మిగిలిన కొద్దిపాటి పంటనైనా అమ్ముకునేందుకు అవస్థ పడాల్సి వస్తోంది. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యాన మండలంలోని చింతకాని, నాగులవంచ సొసైటీల పరిధిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో కాంటా వేసి 15 రోజులు దాటినా బస్తాలను గోదాంలకు రవాణా చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా ఎప్పుడు వర్షం వస్తుందో తెలియని పరిస్థితుల్లో రైతులు రాత్రీ పగలు కాపలా కాయాల్సి వస్తోంది. ఇక మొక్కజొన్న బస్తాలను గోదాలకు తరలించే క్రమాన లారీ డ్రైవర్లు డబ్బులు డిమాండ్ చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

1.28 లక్షల క్వింటాళ్ల కొనుగోలు

మార్క్‌ఫెడ్ ఆధ్వర్యాన మండలంలోని చింతకాని, నాగులవంచ సొసైటీ పరిధిలో చింతకాని, ప్రొద్దుటూరు, నాగులవంచ, పాతర్లపాడు గ్రామాల్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో ఇప్పటివరకు 1.28 లక్షల క్వింటాళ్ల మొక్కజొన్నలు కొనుగోలు చేశారు. చింతకాని సొసైటీ పరిధిలో 75 వేల క్వింటాళ్ల మొక్కజొన్నలను కొనుగోలు చేయగా 55 వేల క్వింటాళ్లు, నాగులవంచ సొసైటీ పరిధిలో 53 వేల క్వింటాళ్ల మొక్కజొన్నలను కొనుగోలు చేయగా 37,500 క్వింటాళ్లు గోదాంలకు తరలించారు. ఆయా కేంద్రాల్లో మిగిలిన బస్తాలే కాక డీసీఎంఎస్ ఆధ్వర్యాన మండలంలోని రామకృష్ణాపురం, లచ్చగూడెం, కొదుమూరు గ్రామాల్లో కాంటా వేసిన సుమారు 17,500 క్వింటాళ్ల మొక్కజొన్నలు గోదాంలకు తరలించాల్సి ఉంది.

వేధిస్తున్న లారీల కొరత

మార్క్‌ఫెడ్, డీసీఎంఎస్ కొనుగోలు కేంద్రాల్లో కాంటా వేసిన మొక్కజొన్న బస్తాలను గోదాంలకు తరలించేందుకు 180 లారీలు అవసరమవుతాయి. ఇదిలాఉండగా రైతుల అవసరాన్ని ఆసరాగా తీసుకుంటున్న లారీ డ్రైవర్లు 50 కేజీల బస్తాకు రూ.8 చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారని సమాచారం. అయినా అధికారులు పట్టించుకోకపోగా, లారీల కొరతతో రైతులు నానా ఇబ్బంది పడుతున్నారు. ఇదిలా ఉండగా రైతుల వద్ద ఇంకా 50 వేల క్వింటాళ్ల మేర పంట ఉందని తెలుస్తోంది. మరోపక్క వ్యవసాయ సీజన్ సమీపిస్తున్న నేపథ్యాన అధికారులు స్పందించి తమ కష్టాలను తీర్చాలని రైతులు కోరుతున్నారు.

బస్తాలను తరలించాలి



కొనుగోలు కేంద్రాల్లో కాంటా వేసిన మొక్కజొన్న బస్తాలను తక్షణమే గోదాంలకు తరలించాలి. కాంటా వేసి పది రోజులు గడిచినా తరలించడం లేదు. సొసైటీ సిబ్బందిని అడిగితే లారీల కొరత ఉందని చెబుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి మా సమస్యలు పరిష్కరించాలి.

– తాళ్లూరి రమేష్, రైతు, జగన్నాథపురం

ఇబ్బందిగా ఉంది



మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు వేసి బస్తాలను కాపాడుకోవడం ఇబ్బందిగా ఉంది. ఎప్పుడు వర్షం వస్తుందో తెలియక రాత్రింబవళ్లు పట్టాలను పట్టుకుని కాపలా కాయాల్సి వస్తోంది. వ్యవసాయ సీజన్ సమీపిస్తుండటంతో ఆ పనులపై దృష్టి సారించలేక ఆందోళన చెందుతున్నాం.

– తోటకూరి నాగేశ్వరరావు, రైతు, జగన్నాథపురం

లారీల కొరత లేకుండా చూస్తాం



కాంటా వేసిన బస్తాలను గోదాంలకు తరలించేందుకు కావాల్సిన లారీలను సమకూరుస్తున్నాం. బస్తాలను ఎప్పటికప్పుడు తరలించేలా పర్యవేక్షిస్తున్నాం. ప్రతీ బస్తాను గోదాంలకు తరలిస్తాం. రవాణాకు సంబంధించి లారీ డ్రైవర్లకు రైతులెవరూ డబ్బు ఇవ్వొద్దు.

– సునీత, మార్క్‌ఫెడ్ డీఎం

మొక్కజొన్న కాంటా వేయడం లేదని రైతుల నిరసన


వైరా–జగ్గయ్యపేట రహదారిపై నిరసన తెలుపుతున్న రైతులు

బోనకల్: మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసిన మొక్కజొన్న బస్తాలను వే బ్రిడ్జి వద్ద సకాలంలో కాంటాలు వేయడం లేదంటూ రైతులు బుధవారం నిరసన తెలిపారు. ఖమ్మం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన మార్క్‌ఫెడ్ కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన మొక్కజొన్నలను బోనకల్ మండలం రావినూతల వేబ్రిడ్జి వద్ద కాంటా వేసి చిరునోముల గోదాంకు తరలిస్తున్నారు. అయితే, లారీల కొరత కారణంగా బస్తాలు కొనుగోలు కేంద్రాల్లోనే ఉంటుండడం, గోదాంకు తరలించే వరకు రైతులదే బాధ్యత కావడంతో వర్షం భయంతో రైతులే సొంతంగా ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. ఈక్రమంలో వేబ్రిడ్జి వద్ద మార్క్‌ఫెడ్, గోదాం అధికారులు చెప్పిన ట్రాక్టర్లకే కాంటా వేస్తుండడంతో మిగిలిన రైతులు ఆందోళనకు దిగారు. ఒకేరోజు ట్రాక్టర్ అద్దె మాట్లాడుకున్నందున వేచి ఉండలేమంటూ వైరా–జగ్గయ్యపేట ప్రధాన రహదారిపై ట్రాక్టర్లను ఉంచి రాస్తారోకోకు దిగారు. దీంతో వాహనాలు నిలిచిపోగా పోలీసులు చేరుకుని వారికి నచ్చచెప్పి ఆందోళన విరమింపజేశారు.

గుజరాత్, మహారాష్ట్ర జట్ల విజయం

కొనసాగుతున్న ఆల్ ఇండియా మహిళా క్రికెట్ టోర్నీ

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో కొనసాగుతున్న ఆల్ ఇండియా మహిళా టీ–20 క్రికెట్ టోర్నీలో భాగంగా బుధవారం తమిళనాడు – గుజరాత్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న తమిళనాడు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 18.2 ఓవర్లు ఆడి 102 పరుగులు చేయగలిగింది. జట్టులో మైథిలి 33 బంతులు ఎదుర్కొని 27, డ్యాన్సీ 19 పరుగులు చేయగా, గుజరాత్ బౌలర్లలో భవ్యమిత్ర నాలుగు ఓవర్లు బౌలింగ్ చేసి 20 పరుగులకు నాలుగు వికెట్లు తీసుకుంది. అలాగే, కీర్తి, ఇటీషా పటేల్ రెండేసి వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన గుజరాత్ జట్టులో కృషి టక్కర్ 30, ఇటీషా పటేల్ 38 పరుగులు చేసి గెలిపించారు. మరో మ్యాచ్‌లో మహారాష్ట్ర – కర్ణాటక జట్లు తలపడగా టాస్ గెలిచిన కర్ణాటక జట్టు బ్యాటింగ్ ఎంచుకుని 20 ఓవర్లలో 108 పరుగులు చేసింది. జట్టులో హాజిల్ 43 పరుగులు చేయగా, మహారాష్ట్ర బౌలర్లలో శ్వేత, ప్రసిద్ధి రెండు వికెట్లు తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్ చేసిన మహారాష్ట్ర జట్టు నిర్దేశిత లక్ష్యాన్ని 15.3 ఓవర్లలోనే అధిగమించింది. ఈ జట్టులో శ్వేత 39, అనిషా 28 పరుగులు చేశారు. కాగా, మ్యాచ్‌లను తెలంగాణ మహిళా టీ–20 క్రికెట్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్ ప్రారంభించగా డబ్ల్యూటీసీ డైరెక్టర్ సందీప్ ఆర్య, మహిళా క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎం.డీ.మతిన్, ఓలేటి సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న గీత కార్మికుడు మృతి


వీరస్వామి(ఫైల్)

నేలకొండపల్లి: కాలుజారి తాటి చెట్టు పైనుంచి నుంచి పడిన గీతకార్మికుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండల కేంద్రానికి చెందిన గీతకార్మికుడు హరి వీరస్వామి(58) మంగళవారం కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు కింద పడగా ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ఈమేరకు ఆయన బుధవారం మృతి చెందగా సర్పంచ్ రాయపూడి నవీన్, ఎంపీటీసీలు బొందయ్య, శీలం వెంకటలక్ష్మితో పాటు కొండలు, జెర్రిపోతుల సత్యనారాయణ, తాతా హనుమంతరావు, మల్లారపు నర్సింహారావు, యలమంద, పీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు తదితరులు నివాళులర్పించారు.

రిజిస్ట్రార్ల మాయాజాలం

- 14 కుంటల భూమి అక్రమంగా రిజిస్ట్రేషన్
- జిల్లా రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్‌పై కేసు నమోదు


గోపె వెంకన్న, బాధితుడు

కూసుమంచి: ఓ రైతుకు చెందిన 14 కుంటల వ్యవసాయ భూమిని కన్వర్షన్ చేసి అక్రమంగా మరొకరి పేరిట రిజిస్ట్రేషన్ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇందుకు కారకులైన జిల్లా రిజిస్ట్రార్, కూసుమంచి సబ్ రిజిస్ట్రార్‌పై కోర్టు ఆదేశాలతో కూసుమంచి పోలీస్‌స్టేషన్‌లో మే 25వ తేదీన పోలీసులు కేసు నమోదు చేయగా, అసలేం జరిగిందో తెలుసుకునేందుకు అధికారులు విచారణ చేపట్టారు. మండలంలోని పాలేరుకు చెందిన గోపె వెంకన్నకు 533–అ సర్వే నంబర్‌లో ఎకరం వ్యవసాయ భూమి ఉంది. గతంలో ఆయన అరుణప్ప వద్ద భూమి కొనుగోలు చేయగా, అరుణప్ప వద్ద చర్చి నిర్మాణానికి మరో రెండు ఎకరాలను ఇతరులు కొనుగోలు చేశారు. ఈక్రమంలో 2020 సంవత్సరం నుండి చర్చి ఫాస్టర్ మేడికొండ స్లీవప్ప, వెంకన్న మధ్య భూమి విషయమై వివాదం జరుగుతోంది. అయితే, వెంకన్న తన భూమికి పాస్‌పుస్తకం తీసుకుని రైతుబంధు సాయం కూడా పొందుతున్నాడు. ఈక్రమంలో జనవరిలో వెంకన్నకు చెందిన భూమి నుంచి 14 కుంటలను చర్చి ఫాస్టర్ స్లీవప్ప అంతవేల్పుల మాధవి పేరుతో లింక్ డాక్యుమెంట్ సృష్టించడమే కాక చనిపోయిన వారి సంతకాలు ఫోర్జరీ చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. జనవరి 11న జిల్లా రిజిస్ట్రార్ వద్ద, 13న కూసుమంచి సబ్ రిజిస్ట్రార్ వద్ద భూమి రిజిస్ట్రేషన్ జరగగా.. విషయం తెలుసుకున్న బాధితుడు వెంకన్న రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులతో పాటు పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేశాడు. ఆ తర్వాత కోర్టును ఆశ్రయించగా అక్రమ రిజిస్ట్రేషన్‌గా నిర్ధారించి జారీ చేసిన ఆదేశాలతో పోలీసులు జిల్లా రిజిస్ట్రార్ రవి, కూసుమంచి సబ్ రిజిస్ట్రార్(ఇన్‌చార్జి)పై కేసు నమోదు చేశారు.

కోట్ల విలువైన భూమి ఆక్రమణ

ఫాస్టర్ చర్చి పక్కనే ఉన్న ఎన్నెస్పీ భూమితో పాటు తన భూమిని ఆక్రమించాడని గోపె వెంకన్న ఆరోపించాడు. సుమారు రూ.2 కోట్ల విలువైన భూమి ఆక్రమణ జరిగిందని, దీనిపై విచారణ చేపట్టాలని కోరారు. అంతేకాక తన భూమి తనకు దక్కేలా చర్యలు తీసుకోవాలని కోరాడు. కాగా, ఈ ఘటనపై రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు విచారణ చేపట్టగా... పూర్తి ఆధారాలు సమర్పించాలని కూసుమంచి సబ్ రిజిస్ట్రార్‌ను బుధవారం ఆదేశించినట్లు సమాచారం.

గోడ కూలి బాలుడు...

జామకాయలు కోసేందుకు ఎక్కగా ఘటన


బన్నీ మృతదేహం

ఖమ్మంక్రైం: ఆడుకుంటూ జామకాయల కోసం ఓ బాలుడు గోడ ఎక్కడంతో అది కూలడంతో మృతి చెందిన ఘటన ఖమ్మంలో బుధవారం చోటు చేసకుంది. ఖమ్మం టూటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. వికలాంగుల కాలనీకి చెందిన చల్లా శివ కూలీ పనిచేసుకుంటూ తన ఇద్దరు పిల్లలతో కలిసి జీవిస్తున్నాడు. ఆయన భార్యతో మనస్పర్థలు రావటంతో ఆమె హైదరాబాద్‌కు వెళ్లి కూలీ పనులు చేసుకుంటోంది. దీంతో కుమార్తె, రెండో తరగతి చదువుతున్న కుమారుడు బన్నీ(10) శివ వద్దే ఉంటున్నారు. ఈక్రమంలో బుధవారం శివ కూలీ పనులకు వెళ్లగా బన్నీ స్నేహితులతో కలిసి ఆడుకుంటున్నాడు. ఈనేపథ్యాన గోడ పక్కనే ఉన్న జామ చెట్టు కాయలు కోసేందుకు ఎక్కాడు. ప్రమాదవశాత్తు గోడ కూలగా కింద పడడంతో తలకు తీవ్రగాయం కావడమే కాక ఇటుకలు మీద పడటంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. దీంతో గుర్తించిన స్థానికులు బన్నీని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్సై తోట నాగరాజు తెలిపారు.

వైన్స్ వద్ద మందుబాబుల వీరంగం


వైన్స్ షట్టర్ దించుతున్న యువకులు

నేలకొండపల్లి: డబ్బు చెల్లింపునకు గూగుల్ పే, ఫోన్‌పే సౌకర్యం లేదంటూ కొందరు యువకులు వైన్స్ వద్ద వీరంగం సృష్టించారు. మండల కేంద్రంలోని వైన్స్ వద్దకు కొందరు యువకులు మద్యం కోసం రాగా, ఫోన్ పే, గూగుల్ పే సౌకర్యం లేదని నిర్వాహకులు చెప్పారు. దీంతో వారు సిబ్బందితో వాగ్వాదానికి దిగడమే కాక షాపును బలవంతంగా మూసేశారు. దీంతో ఇరువర్గాల నడుమ తోపులాట జరగగా సమాచారం అందుకున్న పోలీసులు చేరుకునేలోగా యువకులు వెళ్లిపోయారు.

వాహనం చక్రంలో చీర చిక్కుకుని గాయాలు


రోదిస్తున్న నాగేశ్వరమ్మ

ఎర్రుపాలెం: ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా చక్రంలో చీర చుట్టుకుని కింద పడడంతో ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన పులిచెర్ల నాగేశ్వరమ్మ (45) జమలాపురం మీదుగా ఏపీ రాష్ట్రం గోనపీడుకు తన కుమారుడితో కలిసి ద్విచక్ర వాహనంపై బుధవారం వెళ్తోంది. ఈక్రమంలో జమలాపురం ఆర్చి వద్ద వాహనంలో చక్రంలో ఆమె చీర చుట్టుకుపోవడంతో అదుపు తప్పి కింద పడ్డారు. ఈ ఘటనలో నాగేశ్వరమ్మకు తీవ్ర గాయాలు కాగా మధిర ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించాక ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

రైలు నుండి జారిపడిన మహిళకు గాయాలు

ఖమ్మంక్రైం: రైలులో నుంచి జారి పడడంతో ఓ మహిళకు తీవ్రగాయాలయ్యాయి. జీఆర్పీ ఎస్సై భాస్కర్‌రావు, హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణరెడ్డి తెలిపిన వివరాలు... మధిరకు చెందిన రైల్వే ఉద్యోగి కళాసాని నాగేశ్వరరావు తన కుమారుడిని ఖమ్మంలోని ఆస్పత్రిలో చూపించేందుకు బుధవారం భార్య కృష్ణవేణితో కలిసి వచ్చాడు. ఆస్పత్రిలో పరీక్షలు చేయించాక భార్య, కుమారుడితో స్టేషన్‌కు వచ్చిన ఆయన ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ ఎక్కుతుండగా రైలు కదలడంతో కృష్ణవేణి జారి రైలు, ప్లాట్‌ఫాం మధ్య మధ్య పడిపోయింది. దీంతో ఆమె కుడికాలికి తీవ్రగాయమైంది. ఈమేరకు ప్రయాణికులు రైలును ఆపి ఆమెను బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు.

మూగజీవాలకు పశుగ్రాసం వితరణ

- 11 గోశాలలకు అందజేసిన సత్తుపల్లి సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర
- ట్రాక్టర్లను ప్రారంభించిన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర


గడ్డి వాహనాలను ప్రారంభిస్తున్న ఎంపీ రవిచంద్ర, ఎమ్మెల్యే సండ్ర దంపతులు

ఖమ్మంఅర్బన్: నోరు లేని మూగజీవాలు దైవంతో సమానమని.. భారతీయ సంస్కృతిలో పూజలు అందుకునే గోవులకు పశుగ్రాసం అందజేసే భాగ్యం దక్కడం ఆనందంగా ఉందని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తెలిపారు. సత్తుపల్లి నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో రైతుల నుండి సేకరించిన 150 ట్రాక్టర్ల వరి గడ్డిని ఖమ్మంలోని 11 గోశాలలకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ట్రాక్టర్లను వద్దిరాజు రవిచంద్రతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మూగజీవాల సంరక్షణపై ప్రతీఒక్కరు దృష్టి సారించాలని కోరారు. గత ఐదేళ్లుగా రైతుల సహకారంతో వరి గడ్డిని గోశాలలకు అందిస్తున్నామని పేర్కొన్నారు. సుమారు రూ.15 లక్షల విలువైన వరిగడ్డిని అందించిన నియోజవర్గ రైతులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తొలుత టేకులపల్లి గోశాలలో గోవులకు దాణా అందించడంతో పాటు శ్రీవెంకటేశ్వర ఆలయంలో సండ్ర దంపతులు పూజలు చేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధుసూదన్, గోశాల బాధ్యులు ఆరుట్ల శ్రీనివాసాచార్యులు, డీసీఎంఎస్ చైర్మన్ రాయల శేషగిరిరావుతో పాటు నాయకులు బసవేశ్వరరావు, యల్లంపల్లి హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్సీ మధు


ఎమ్మెల్సీకి శుభాకాంక్షలు చెబుతున్న సీఎం కేసీఆర్

ఖమ్మం వైరారోడ్: ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ తన పుట్టిన రోజు సందర్భంగా బుధవారం హైదరాబాద్ ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన సీఎం ఆశీస్సులు అందుకున్నారు. తాతా మధు వెంట ఆయన కుమారుడు ఇటీవల న్యూయార్క్‌లో గ్రాడ్యుయేషన్ పట్టా అందుకున్న భార్గవ్ ఉండగా ముఖ్యమంత్రి అభినందించారు.

కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యం

డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్


సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షులు దుర్గాప్రసాద్

కారేపల్లి: కాంగ్రెస్ బలోపేతమే ప్రతీ కార్యకర్త ముందున్న లక్ష్యమని, యువతరంలో దాగి ఉన్న నాయకత్వ లక్షణాల ఆధారంగా వారికి ప్రాధాన్యత ఇస్తూ పార్టీ పటిష్టతకు కృషి చేయనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తెలిపారు. కారేపల్లిలో బుధవారం ఏర్పాటుచేసిన ఎల్‌డీఎం(లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ మెంబర్స్) ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తలారి చంద్రప్రకాశ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలోతు రాందాస్‌నాయక్‌తో కలిసి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ వైరా నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందని, శ్రేణులు ఐక్యంగా కృషి చేస్తూ పటిష్టకు పాటుపడాలని తెలిపారు. సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన యాత్ర ముగింపు సభను జూన్ మూడో వారంలో ఖమ్మంలో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కాగా, దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి నాయకత్వాన ఆనాడు ఏఐసీసీ అధ్యక్షురాలు సోనియాగాంధీ గిరిజన పోడుదారులకు పోడు పట్టాలు ఇచ్చారని, మళ్ల కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే పోడుదారులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. చీమలపాడు ఘటనలో బాధిత కుటుంబాలకు కంటితుడుపు చర్యగా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు కొంత మేర పరిహారం ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. ఇకనైనా బాధిత కుటుంబాలకు రూ.కోటి పరిహారం చెల్లించడమే కాక ఇంట్లో ఒకరి ఉద్యోగంతో పాటు, డబుల్ బెడ్ రూం ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎల్‌డీఎం రాష్ట్ర కోఆర్డినేటర్ మద్దినేని రమేష్, నాయకులు పాలకుర్తి నాగేశ్వరరావు, సురేందర్ మనియార్, మేదరి టోనీ, వీరప్రతాప్, వాంకుడోతు గోపాల్‌నాయక్, పోలగాని శ్రీనివాసరావు, బానోతు హీరాలాల్, షేక్ అఫ్సర్, ఓంప్రకాశ్, చట్టి వీరభద్రం, ఆవుల వెంకటేశ్వర్లు, వినోద్, పాటి నర్సయ్య, బోళ్ల రమేష్, పమ్మి అశోక్, జానీ, తోటకూరి రాంబాబు, సంగు నాగయ్య, పుచ్చకాయల వీరభద్రం పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షుడికి సన్మానం

తిరుమలాయపాలెం: జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా రెండోసారి ఎంపికైన పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌ను తిరుమలాయపాలెం మండల నాయకులు బుధవారం ఖమ్మంలో సన్మానించారు. నాయకులు ఉన్నం రాజశేఖర్, సాగర్‌రెడ్డి పాప్యానాయక్, పోట్ల కిరణ్, శ్రీనివాస్, మోహన్, సుమన్, దేవేందర్ పాల్గొన్నారు.

13న పామాయిల్ రైతు సదస్సు

అశ్వారావుపేటరూరల్: ఈనెల 13న అశ్వారావుపేటలో రాష్ట్రస్థాయి పామాయిల్ రైతు సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏఐకేఎస్ అనుబంధ తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసాని ఐలయ్య తెలిపారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ సదస్సుకు రైతులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. నాయకులు పుల్లయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.